# బ్రతుకు గారడీ

**-కె.తాయారమ్మ**

విజయనగరం స్టేషన్‌లో తూర్పువెళ్లే రైలు కదలడానికి సిద్ధంగా వుంది.

''ఇది తూర్పుబండేనా బాబూ?'' అంటూ హడావిడిగా ప్లాట్‌ఫారం వైపు పరుగెత్తుకొస్తున్నాడు ఓ ఆసామి.

''అవునయ్యా ఇది తూర్పుబండే!''

''ఇంతసేపూ మైకులో అరుపు వినిపించడం లేదూ?'' ఇంకెవరో వ్యక్తి చిరాకుపడుతూ అంటున్నాడు.

మళ్లీ ఎనౌన్స్‌మెంటు వినిపించింది.

''ఏమయ్యా అలా టి.వి. చూస్తూ నిలుచుంటే నీ సామాన్లు గోవిందా? అదిగో బండి బయలుదేరుతోంది!'' ఒకరు ఇంకొకర్ని గట్టిగా కసురుతున్నారు.

అంతా హడావిడి.

''ప్యాసింజరు బండికే అంత హడావిడి ఎందుకో?'' సినిమా పత్రిక తిరగేస్తున్న ఓ నాగరికుడి ఆర్గ్యుమెంటు.

''ఏమిటో ఈ ప్రయాణాలూ, ఈ బంధాలూ, ఈ చుట్టరికాలూ, ఎప్పుడో ఒకప్పుడు ఏ మనిషికైనా పెద్దప్రయాణం తప్పదు'' ఓ తాత్వికుడి వేదాంత ఘోష!

బండి కదిలింది.

ఇంతలో కదులుతున్న బండివైపు ఓ వ్యక్తి పరుగెత్తుకొస్తున్నాడు.

''ఏం బాబూ ఇంతసేపూ ఒంటిమీద తెలివిలేదా? వేగం ఎక్కు! లేకపోతే పడి చస్తావు'' ఇంతవరకూ వాగినవాళ్లలో ఒకడు అంటున్నాడు.

అతను హడావిడిగా వచ్చి రైలు ఊచలు పట్టుకుని ఎగబాకినాడు.

''ఏంది పిచ్చయ్యా ఇట్టా పరుగెత్తుకొచ్చావు? కొంపదీసి ఏ పోలీసులన్నా వెంటబడ్తున్నారేమిటి?'' జనం మధ్యలోంచి ఒకడన్నాడు.

అతని పెదాల మీద శుష్కహాసం వెలిగింది.

'నిజమే! తను పిచ్చయ్యే అందుకు తన ఆకార వికారాలే సాక్ష్యం!'

ఓ సీటు వెతుక్కు కూచున్నాడతను.

అలసటతో అతని గుండె దడదడలాడుతోంది. ఎంతో దూరంనించి పరుగెత్తుకొచ్చాడు.

నుదుటపట్టిన చెమటను సుతారంగా తుడుచుకున్నాడు.

బండివేగాన్ని పుంజుకుంది. ప్రయాణీకుల హడావిడి తగ్గింది.

''ఏ ఊరు మన్షి?'' ఎవరో ప్రశ్నించారు.

తడబడ్డాడతను. 'ఏం చెప్పాలి?' ఒత్తుగా పెరిగిన గెడ్డం, ఆ గెడ్డంలో అక్కడక్కడ వెండితీగెలలాంటి కేశాలు, గుబురుగా పెరిగినజుట్టు, ఎండి బీటలు వారిన పెదాలు, పీక్కుపోయిన ముఖం, లోతుకుపోయిన కళ్లల్లోంచి చిన్నివెలుగులు మాత్రం ప్రసరిస్తున్నాయి.

అతని చూపులు శూన్యంలోకి గుచ్చుకుంటున్నాయి.

ఆ చూపుల వెనుక ఏవో సజీవసత్యాలు దాగుడుమూతలాడుతున్నాయి.

అతను నల్లని రగ్గులాంటిది కప్పుకున్నాడు. చేతికి పెద్దసంచిలాంటిది వేలాడుతోంది. ఇంకో చేతిలో ఓ కర్ర.

అతని వయస్సు కనుక్కోవడం కష్టం!

బ్రతుకు బరువులో విసిగివేసారిపోయి, ఈ సువిశాల విశ్వంలో ఏడకోపారిపోయి, తిరిగి అగమ్య గోచరమైన దారిలోకి వస్తూ వస్తూ..ఎక్కడికి?...ఎక్కడికి?...జీవన విహంగం ఎగిరిపోకమునుపే..ఆ నిజం బయల్పడాలి!

పధ్నాలుగు సంవత్సరాల తరువాత వస్తున్నాడు తను. ఎవరికోసం? కనిపెంచిన తల్లిదండ్రులకోసమా? తోబుట్టువులకోసమా?

కాదు, కాదు, మరి? ప్రేమనే మత్తులో ముంచి చివరికి..చివరికి..మరి ఊహించలేకపోయాడు.

ఏదో స్టేషన్‌లో బండి ఆగింది.

''తూర్పువెళ్తున్నారా? ఏ ఊరు?''

''తూర్పు బండి తూర్పుకికాక పడమటికి వెళ్తుందా?''

ఎండిన పెదాలమీద జీవం లేని నవ్వు.

''ఇచ్ఛాపురం దగ్గర ఏదో పల్లెటూరు!''

''అది ఎవరిది? ఎవళ్లున్నారక్కడ?''

తన ప్రాణం! దెబ్బతిన్న తన హృదయం!

భగవాన్!

చేతితో కణతలు రుద్దుకున్నాడు. దగ్గుతెరముంచుకొచ్చింది. తన ఆయుస్సూత్రం గట్టిదే! లేకపోతే ఈసరికే తెగివుండేది.

తూర్పు బండి కదిలింది మళ్లీ.

సీటుకి చేరబడ్డాడతను.

ఆశలు నశించిన ఆ కన్నులలో ఎన్నో జ్ఞాపకాల వలయాలు, స్మృతుల పరిమళాలు, ఏ దివ్య లోకాలకో ఎగిరివెళ్లి క్షణాలలో తిరిగి వచ్చే పిచ్చిమనస్సు. ఆ మనసు వెనుక వికటాట్టహాసం చేసే యదార్థ సజీవ సత్యం.

'ఆ ప్రాణం ఎవరు? ఆ మరుపురాని..మధురదృశ్యం ఏది?..ఆ రాగవాహిని ఎవరు?'

'ఆమె దేవకి తనని మురిపించి వలపించి, జీవితాన్ని తియ్యని కోరికగా మిగిల్చిన..ఆమె..దేవకి!'

భావోద్వేగంతో అతని ఎడద ఎగిసిపడుతోంది. జ్ఞాపకాల తెరలు అతని కనులకి అడ్డు తగులుతున్నాయి.

ఆ జోలెలాంటి పెద్ద సంచిలోంచి అట్టడుగున వున్న ఓ కార్డు తీశాడు. అది కొత్తగా వుంది. గోల్డుకలర్ అక్షరాలు మిలమిల మెరుస్తున్నాయి దానిమీద. వాటినే పరిశీలనగా చూస్తున్నాయి అతని కళ్లు.

అది ఒక వెడ్డింగ్ కార్డు.

దాని వయస్సు పధ్నాలుగు సంవత్సరాలు.

'చి.సౌ.దేవకి-చి.వసుదేవ్' ఎంత అందంగా కలిశాయి ఆ పేర్లు!

గతం వర్తమానాల మధ్య ఊగిసలాడింది అతని మనస్సు. భవిష్యత్తు లేదు.

''మీ ఆయుర్దాయం ఇంక ఆరునెలలే! మీకెవరైనా వుంటే అక్కడికెళ్ళండి!'' ఏ డాక్టరూ రోగిముందు అలా చెప్పడు! కాని..తన హీనస్థితి డాక్టర్ చేత అలా చెప్పించింది. నిజాన్ని నిర్భయంగా చెప్పే వాళ్ళంటే తనకిష్టం! దాగుడుమూతలు తనకి నచ్చవు!

దేవకి విషయంలో అదే జరిగింది-

ప్రాణస్నేహితుడు రాజు చెప్పిన మాటలు తను నమ్మలేదు! బంగారు భవిష్యత్తు మాడి మసి అయిపోయింది. అవమానాన్ని భరించలేని తను ఏ సుదూర తీరాలకో పారిపోయి దాక్కున్నాడు.





తననితానే హింసించుకున్నాడు. నిందించుకున్నాడు. తిట్టుకున్నాడు. పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు. చివరకు పిచ్చయ్యగానే మిగిలిపోయాడు.

తనది సెల్ఫ్ శాడిజమ్.

ఒకప్పుడు తూర్పు బండంటే ఎంతిష్టం?

తను దేవకి, ఖాళీగావున్న ఆ పెట్టెలలోకి ఎక్కి ఎంత చక్కగా ఆడుకునేవారు. తను డ్రైవర్, దేవకి గార్డు.

అప్పుడు తమ వయస్సులు ఏడెనిమిది సంవత్సరాలు మాత్రమే!

తన తాతపేరు వసుదేవయ్యగారు. తనకాపేరే పెట్టారు. తను వసుదేవ్. చినమామయ్య కూతురు దేవకి ఆమెకాపేరు ఎలా వచ్చిందో?

దేవకి తన కోసమే పుట్టిందిట! అమ్మ చెప్తూ వుండేది. ఇప్పుడా అమ్మ ఏది? కాలగర్భంలో కలిసిపోయి నాలుగేళ్లయ్యిందిట! ఎవరో చెప్పారు.

వెచ్చని కన్నీటి బిందువులు చెక్కిళ్ల మీదుగా జారాయి.

''విచిత్రం!'' ఇంకా తనకి కన్నీళ్లున్నాయా?

తండ్రిని పోగొట్టుకున్న తను, భర్తని పోగొట్టుకున్న అమ్మ అందరికీ చులకనే!

తనకి బాగా జ్ఞానం వచ్చేవరకు తను, అమ్మ చినమామయ్య ఇంట్లో వుండేవారు. దేవకి, తను ఒకర్నొకరు విడిచి క్షణ కాలం వుండేవారు కాదు!

ఏ పదార్థం తెచ్చినా ''బావా కాకి ఎంగిలి పెట్టనా?'' అంటూ వుండేది దేవకి.

అప్పుడు చినమామయ్య ఇచ్ఛాపురం దగ్గర ఓ చిన్న పల్లెటూర్లో స్టేషన్ మాస్టర్‌గా వుండేవాడు.

ఆ ఊరు పేరు చిన్నూరు! అక్కడో రైల్వే స్టేషన్.

తనూ దేవకి ఒకరంటే ఒకరు ప్రాణం యిచ్చుకునేవారు. తనకంటే రెండేళ్లు చిన్నది దేవకి.

ఉన్నట్టుండి నాన్న తరపువారి నుండి కబురొచ్చింది అమ్మకి. ఆస్తి అంతా అమ్మపేర రాసి తాతయ్య పోయారట!

వృద్ధాప్యంలో వున్న మామగార్ని వదిలి పుట్టింటికి వచ్చినందుకు బాధపడింది అమ్మ.

''ఎక్కడ వుండాల్సిన వాళ్లు అక్కడ వుంటేనే అందం. అనుక్షణం చిన్నత్తయ్య సూటిపోటి మాటలు!''

ఏమీ చెయ్యలేని నిస్సహాయత చినమామయ్యది.

ఇవేమీ తెలియని తను, దేవకి.

తనని తీసుకుని విజయనగరం బయలుదేరింది అమ్మ. తాతయ్య ఆస్తి యాభైవేల దాకా వచ్చింది.

ఆమె ముఖంలోకి కాంతి వచ్చింది. ధైర్యం వచ్చింది. విజయనగరంలో దాసన్నపేటలో చిన్నఇల్లు అద్దెకు తీసుకుని తనని చదివించడం మొదలుపెట్టింది.

ఇప్పటికీ తాను మరిచిపోలేని దృశ్యం అది. తను, అమ్మ బయలుదేరుతూ వుంటే వీధి అరుగుమీద స్తంభం పట్టుకుని నిలుచుని అమాయకంగా చూస్తున్న దేవకిరూపం!

''మళ్లీ ఎప్పుడొస్తావు బావా?''

''ఏమో!'' ఉదాసీనం, రోషం గురగురలాడాయి

గొంతులో.

ఆ వయస్సులో అది విచిత్రమే.

దేవకి కళ్లలో నీళ్లు.

''పదరా వసూ! వస్తాను చిన్నతంబీ!'' అని చినమామయ్యకి చెప్పి తనని బయలుదేరదీసింది.

అమ్మ చినమామయ్యని 'చినతంబీ' అని పిలుస్తుంది.

విడువలేక విడువలేక దేవకిని విడిచివెళ్తున్న జ్ఞాపకం, ఇప్పటికీ సన్నని మంటలు రేపుతుంది.

విజయనగరంలో తన చదువు మొదలయింది.

దాసన్నపేటకి దగ్గరలో అయ్యకోనేరుగట్టు మీద వుండేది అరటి చెట్లబడి. అందులో నాల్గవ తరగతిలో చేరాడు తను.

ఏ రెండు జడల పాప కనిపించినా, ఎర్రని రిబ్బన్లతో ఎర్రటిగౌనుతో వున్న దేవకి ప్రత్యక్షమయ్యేది.

తన పక్కనే కూచునే ముద్దుగా బొద్దుగా వుండే రాజు తనకు మంచి స్నేహితుడయ్యాడు. రాజంటే తనకి ప్రాణం! దేవకి తరువాత స్థానం రాజుదే!

ఒక్క క్షణం కూడా విడిచివుండేవాడు కాదు రాజు తనని. ఒకే మంచం, ఒకే కంచం అంటూ వుండేవారు స్నేహితులు.

దేవకిని తను ఎప్పుడు చూస్తాడు? అప్పుడప్పుడు దేవకి తనకి ఉత్తరాలు రాస్తోంది వచ్చీరాని భాషలో. ''బావా ఎప్పుడొస్తావు?'' అంటూ.

తను కూడా రాస్తూ వుండేవాడు. ''తూరుబ్బండి చిన్నపోయిందా దేవకీ?'' అంటూ.

కాలం గిర్రున తిరిగిపోతోంది.

నాటి నుంచీ తను మరి చిన్నూరు వెళ్లలేదు. దేవకి రూపాన్ని మాత్రం పదిలంగా తన హృదిలోనే దాచుకున్నాడు. చిన్నరబ్బరు బొమ్మలా వుంటుంది దేవకి.

ఇంటర్ ఫస్టున పాసయ్యేడు. అరటిచెట్ల బడి నుంచి కాలేజి వరకు ఎదిగిన తనని తానే అపురూపంగా చూసుకుంటాడు.

''సన్నని మీసకట్టు అందంగా స్మార్టుగా వుంటావు'' అంటారు తనని స్నేహితులు.

''ఇప్పుడు దేవకి ఎలా వుందో?''

ఓ రోజు హఠాత్తుగా ఊడిపడ్డాడు చినమామయ్య కుటుంబంతో.

అపరంజి బొమ్మలా మెరిసిపోతున్న దేవకిని చూస్తూ స్థాణువే అయ్యేడు తను.

''దేవకి ఎంత మారిపోయింది?'' గౌన్లలో వుండే దేవకి ఇప్పుడు పరికిణీ వోణీలలోకి ఎదిగిపోయింది. ముగ్ధమనోహరంగా వుంది ఆమె రూపం.

''బావా మరిచిపోయావా?'' సిగ్గుగా నేల చూపులు చూస్తూ ప్రశ్నించింది.

''నువ్వు మరిచిపోయావా నన్ను?''

''లేదు!''

''నేనూ అంతే! తూరుబ్బండి బాగుందా?''

ఇద్దరి మధ్యా నవ్వులు

''అక్కయ్యా తప్పుతుందామరి. ఆడపిల్లని కన్న తండ్రిని. పైగా మేనమామని. దేవకి పదవ తరగతి పాసైంది. ఈ యేడు దాని పెళ్లి చేసేస్తే..'' నసిగాడు మామయ్య.

''అవును వదినగారూ మా తప్పులేవైనా వుంటే మన్నించండి!'' చిన్నత్తయ్య వంతపాడింది.

తనూ..దేవకీ...ఒకరి కళ్లల్లోకి ఒకరు చూస్తూ.... చిలిపిగా..నవ్వుకుంటున్నాం.

అదో సంబరం!

అప్పుడే పెళ్ళేమిటి చిన్నతంబీ వాళ్లని హాయిగా చదువుకోనియ్యి'' అమ్మకి లోకజ్ఞత అధికం.

''సరే నీ ఇష్టం! దేవిని కూడా నీదగ్గరే వుంచి చదివించు!''

అమ్మ పొంగిపోయింది. పుత్తడిబొమ్మలాంటి దేవకి తమ ఇంట్లో తిరుగుతూ వుంటే ఎంతో ఉల్లాసంగా వుంది.

రోజులు దొర్లిపోతున్నాయి.

దేవకి కాలేజీలో చేరింది.

తను డిగ్రీ-దేవకి ఇంటర్.

చాలామంది అబ్బాయిలు దేవకి కోసం అగచాట్లుపడుతున్నారని తనకి తెలుసు! దేవకీ తనూ భార్యాభర్తలు కాబోతున్నారని వాళ్లకీ తెలుసు. అయినా అదో సరదా!

దేవకి అందరితో సరదాగా మాట్లాడుతుంది. అప్పుడప్పుడు తన మనసులో సన్నని ఈర్ష్య మెలి తిరుగుతూ వుంటుంది. అయినా దేవకిని ఆపలేదు. అంత కుసంస్కారి కాడు తను!

తను, దేవకి, రాజు సరదాగా కబుర్లు చెప్పుకుంటూ జగన్నాథస్వామి కోవెల వద్ద, నల్లచెరువు మెట్లలోను, అయ్యకోనేరుగట్లమీద తిరుగుతూ వుండేవారు.

అవో తియ్యని జ్ఞాపకాలు.

ఆరోజు తను చూసిన దృశ్యం తనకింకా గుర్తుంది. తమ కాలేజీ విద్యార్థి నాయకుడు రవిచంద్రతో పగలబడి నవ్వుతూ మాట్లాడుతోంది దేవకి. ఇంటికి వచ్చేక తను ఏమీ అడగలేదు. దేవకి చెప్పింది. ''నా నోట్సు వాలాగే అందంగా వుంటుందిట!'' తనకి ఇమ్మన్నాడు రవిచంద్ర.

''ఇచ్చావా?''

''లేదు! నిన్ను అడిగి యిస్తానన్నాను.''

తను ఆవేశం పట్టలేక దేవకి చెంప ఛెళ్లుమనిపించాడు.

''బా..వా.. ఇంకెప్పుడూ ఇలా చెయ్యను!'' వెక్కిళ్ల మధ్య అంది దేవకి.

దగ్గరగా తీసుకుని లాలించాడు.

తనకి తెలుసు దేవకి మనసులో తనకి తప్ప ఇంకెవరికీ చోటులేదు!

వేసవి సెలవులకి చిన్నూరు వెళ్లాడు తను దేవకితో. చిన్నత్తయ్య ఎన్నో రకాల పిండివంటలు చేసి పెట్టింది. తను కాబోయే అల్లుడు మరి?

దూరంగా తూరుబ్బండి కనిపించింది.

బంగారు భవిష్యత్తు తమ కనులముందు కదలాడుతోంది! ఎంతో పదిలంగా దాచుకోవాల్సిన పరువాన్ని తనముందు పరిచింది దేవకి. కాదనలేకపోయాడు తను.

అనుకోకుండా ఏదో ట్రైనింగ్ వచ్చింది. ఢిల్లీ వెళ్లాలి.

అమ్మతో, దేవకితో తను ఢిల్లీ ప్రయాణమయ్యేడు.

దూరపుబంధువు గోపమ్మ ఇంట్లో మకాం. గోపమ్మ ఢిల్లీలో నర్సు ఉద్యోగం చేస్తోంది.

దేవకి అందం తనని అనుక్షణం మురిపిస్తోంది. అయినా నిగ్రహించుకుంటున్నాడు. ఒకనాడు తూరుబ్బండిలో చేసిన తప్పు మళ్లా చెయ్యాలనుకోవడం లేదు. ఆ తప్పువల్ల దేవకి నెల తప్పింది. ఆ విషయం రహస్యంగానే వుంచేశాం. సంవత్సరం గిర్రున తిరిగింది. ట్రైనింగ్ పూర్తయింది నాకు. విజయనగరం బయలుదేరాము. పెళ్లి ముహూర్తాలు పెట్టారు. దేవకి వసుదేవుల పెళ్లి.

చిన్నూరులో పెళ్లి యిల్లు సందడిగా వుంది. ఇటుపై దేవకి తనకి శాశ్వతంగా దగ్గరవుతుంది.

రాజు అన్ని పనులలోనూ ఉత్సాహంగా తిరుగుతున్నాడు.

''పెళ్లి కూతురు కనిపించడం లేదు!''

పెళ్లి పందిరి అంతా ఒకటే సంచలనం.

గతుక్కుమన్నాడు తను!

తను అలా పీట మీదే కూచుండిపోయాడు. అందరూ తలో రకంగా అనుకుంటున్నారు.

నిమిషాలు దొర్లిపోతున్నాయి.

దేవకి తను కోరుకున్న వాడితో మనువు చేసుకుని దండలతో వచ్చింది.

సిగ్గు బరువుతో తలవాలిపోయింది. పెళ్లి కూతురిగా దేవకి తల వంచుకోవలసిన తరుణం! కాని..కాని..తను వంచుకున్నాడు. పెళ్లికొడుకెవరో తను చూడలేదు.

అందరూ తనని జాలిగా చూస్తున్నారు. తను భరించలేడు. ''పోవాలి! ఎక్కడికో పారిపోవాలి! ఏ మారుమూలకో ఏ సుదూర తీరాలకో!'' పరుగెత్తి పరుగెత్తి కదులుతున్న రైలెక్కి పారిపోయాడు.

మళ్లీ పద్నాలుగేళ్ల తరువాత ఇలా.

పెద్ద కూతురితో రైలాగింది.



## దటీజ్ కరిష్మా!

అవకాశం వచ్చినప్పుడే ప్రతీకారం తీర్చుకోవాలి అనే సిద్ధాంతాన్ని ఎంచక్కా అమలు జరిపింది కరిష్మా కపూర్ ఇటీవల. ఆమధ్య రిలీజ్ అయిన 'రక్షక్' చిత్రంలో సునీల్ శెట్టి హీరో. ముందనుకున్నట్టయితే అందులో కరిష్మా నటించాల్సింది. సునీల్ పథకం పుణ్యమాని అందులో హీరోయిన్గా నటించిన రవీనాకి 'షహర్‌కే లడకే' అనే పాట బోల్డు పేరు తెచ్చింది. ఆ సంగతిని గుర్తుపెట్టుకుని ఇటీవల 'రఫ్తార్' చిత్రంలో సంజయ్ దత్ హీరోగా అంటే ముందు ఒప్పుకున్న కరిష్మా ఆనక హీరో మార్పు జరిగి సునీల్ శెట్టి రంగప్రవేశం చేయడంతో ఎలాంటి మొహమాటాలకీ వెళ్లకుండా నేను చిత్రంలో నటించనని ఖచ్చితంగా చెప్పేసి తప్పుకుందిట. ఎంతైనా ఇప్పుడామెకి హీరోయిన్గా మాంచి డిమాండ్ వుందిగా!

-జె.ఎం.

గతంలోంచి వర్తమానంలోకి వచ్చాడు.

''చిన్నూరు!'' అన్నబోర్డు కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది.

''ముందు చిన మామయ్యను చూడాలి!'' దేవకి కూడా చిన్నూరులో వున్నట్టే తెలిసింది. అందర్నీ ఒకేసారి చూసెయ్యొచ్చు!''

ఇంకా ఎవరికోసమో మనసు పరితపిస్తోంది.

దూరంగా పెంకుటింటిముందు వసారాలో నవారు మంచం వాల్చుకు కూచున్నాడు చినమామయ్య. రిటైర్ అయినా చిన మామయ్యలో ఏ మార్పూ లేదు. దృఢంగా అలాగే వున్నాడు.

''చినమామయ్యా బాగున్నావా?'' వసారా మెట్లెక్కుతూ పలకరించాడు.

''ఎవరూ?'' నోట్లో బీడీ తీసి దూరంగా విసిరేస్తూ ప్రశ్నించాడు.

''నేను చినమామయ్యా వసూని!''

''ఒరే వసూ నువ్వా? ఇన్నాళ్లూ ఎక్కడున్నావ్? నీకు తీరని ద్రోహం జరిగిపోయిందిరా! మీ అమ్మ పోయింది తెలుసా? మీ చిన్నత్తయ్య కూడా కాలం చేసిందిరా! నేనుమాత్రం గుండ్రాయిలా బ్రతికున్నాను.'' చినమామయ్య నేత్రాలలో అశ్రుకణాలు కదలాడాయి.

అలా చూస్తూవుండిపోయాడు తను.

''అమ్మాయ్ ఎవరొచ్చారో చూడు! అర్జంటుగా కాఫీ తీసుకురా!'' అంటూ కేకేశాడు.

కాఫీ కప్పుతో వచ్చిందో స్త్రీ. ఒక విధమైన గంభీరతని సంతరించుకుని, హుందాగా నిండుగా వుందామె.

కళ్లు వెడల్పు చేసుకు చూశాడు తను. తనకు చిరపరిచితాలైన ఏవో పోలికలు..ఆమె...ఆమె..దేవకి.

సంపూర్ణ గృహిణీత్వాన్ని సంతరించుకుని నిండు గోదావరిలా వుంది.

''దే..వ..కీ!'' గొంతులోనే ఆగిపోయింది ఆ పిలుపు.

''దేవకీ! బావ వసుదేవుడు!'' చినమామయ్య చెప్పాడు.

ఆమె ముఖంలో ఆశ్చర్యం తొణికిసలాడింది. ''బావా''ఆమె పిలుపు కూడా గొంతులోనే వుండిపోయింది.

ఇద్దరి చూపులూ క్షణకాలం ఢీకొని అంతలోనే విడివడిపోయాయి.

ఎవరికోసమో తన కళ్లు వెతుకుతున్నాయి.

''ఒరే వసూ! నిన్నూ నీ బ్రతుకుని అపహాస్యం పాలు చేసిన దేవకి మహత్తరమైన శిక్ష అనుభవిస్తోందిరా!''

''ఏమిటి చినమామయ్యా?''

''పెళ్లయి పధ్నాలుగేళ్లయినా ఒక్క బిడ్డని కూడా ప్రసాదించలేదు ఆ భగవంతుడు. స్త్రీ జాతికే శాపమైన గొడ్రాలితనం అనుభవిస్తోంది దేవకి.''

''దేవకి గొడ్రాలా?''

''దేవకి ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె భర్త ఎక్కడ?'' అదే అడిగాడు చినమామయ్యని.

''దేవకి భర్తది క్యాంపుల ఉద్యోగం. క్షణం ఇంట్లో వుండడానికి అవదురా వసూ! అమ్మాయికి నేనూ, నాకు అమ్మాయి తోడుగా వుంటాము. దాని కడుపున ఓ బిడ్డవుంటే ఈ బాధ వుండేది కాదు.''

తను మాట్లాడలేకపోయాడు.

''ఎలా అయిపోయావు బావా? ఇదంతా నానుంచే కదూ?'' దేవకిగొంతులో వేదన తొణికిసలాడుతోంది.

వేదాంతిలా నవ్వాడు తను.

''చిన మామయ్యా నేను వెళ్లొస్తాను.''

''అదేమిట్రా వసూ నువ్వూ మాతోనే వుండరాదూ! ఈ పరిస్థితిలో నువ్వెక్కడికెళ్తావు?''

''అవును బావా నువ్వూ మాతోనే వుండు!''

''ఉంటాను. కాని..కాని ఇప్పుడు కాదు. నేను చేయాల్సిన పని ఒక్కటి మిగిలివుంది. అది పూర్తయితే నేను ఏమైపోయినా బాధలేదు.'' చేతి సంచి, కర్ర తీసుకుని బయలుదేరాడు.

ఆ తండ్రీ కూతుళ్లు అతన్ని వారించలేకపోయారు.

మళ్లీ ఢిల్లీ ప్రయాణం? 'ఇప్పుడు గోపమ్మ ఎలా వుందో? అసలు వుందో లేదో.'

గోపమ్మ మంచానపడింది. పదిహేనేళ్ల పిల్ల ఎదురొచ్చింది. ఆ పిల్ల అచ్చం దేవకిలా వుంది.

''పాపా నీ పేరేమిటి?''

''కిసలయ!''

ఏదో సాధించిన ఆత్మస్థైర్యం! బ్రతుకుబాటలో చిన్న తీపి అనుభవం.

గోపమ్మ కిసలయని తనకి అప్పగించి ప్రశాంతంగా కన్నుమూసింది.

కిసలయని తీసుకుని తిరుగుప్రయాణం. ప్రయాణాలమీద ప్రయాణాలు. 'బహుశా ఇదే ఆఖరి ప్రయాణమేమో?' డాక్టరిచ్చిన గడువులో మూడు నెలలు కరిగిపోయాయి.

కిసలయకి క్లుప్తంగా తన కథ వినిపించాడు.

అమాయకంగా విందాపిల్ల.

''ఇంకొక్క కోరిక మిగిలిపోయింది. అది ఏమిటి? ఈ దీపం ఆరిపోయేలోగా ఒక్కసారి రాజుని చూడాలి.''

★★★

పెద్ద శబ్దం చేస్తూ రైలుబండి పట్టాల మీద నడిచిపోతోంది. సీటుకి చేరబడి శూన్యంలోకి చూస్తున్నాడు వసుదేవ్.

ఎదురుసీట్లో కిసలయ కునికిపాట్లు పడుతూ కూచుంది.

అతనికి దగ్గు ముంచుకొస్తోంది. అతి ప్రయాసతో ఊపిరి తీసుకుంటున్నాడు. మెల్లగా సీట్లోంచి లేచి వెళ్లి సింక్‌లో భళ్లున రక్తం కక్కుకున్నాడు.

ఇంకా కొద్దిసేపు బ్రతకాలి. ''చినమామయ్యకి నిజం చెప్పాలి''

''దేవకి గొడ్రాలు కాదు!''

''టికెట్ టికెట్!''కిసలయ దగ్గరగా వచ్చి అడుగుతున్నాడు టికెట్ కలెక్టర్.

బెదురుతూ తన వైపు చూసిందా పిల్ల.

కళ్లు మగతగా మూసుకుపోతున్నాయి. నిస్సత్తువ నిండుగా ఆవరించింది.

జేబులు తడిమి టిక్కెట్లు బయటికి తీశాడు. ఇవాళ కిసలయ కోసం తను టిక్కెట్లు కొన్నాడు.

టికెట్ తీస్తూ అతని ముఖంలోకి చూశాడు. ఆశ్చర్యంతో అతని గొంతు పూడుకుపోతోంది. ''ను..వ్వు..రాజువి కదూ?''

''వసుదేవ్ నువ్వా? ఎలాంటివాడివి ఎలా అయిపోయావు? జీవితాలు ఎంత చిత్రమైనవి. విధి ఎంత క్రూరమైనది, పద మా ఇంటికెళ్దాం.''

''రాజూ నన్ను క్షమించు. నేను రాలేను. నా బ్రతుకు ఇక కొద్దిరోజులే! నిన్ను చూడాలనుకున్నాను. చూశాను. ఇక నేనేమైపోయినా ఫరవాలేదు. ఈమె నా బిడ్డ. ఈ పాపని నీకు బహుమతిగా ఇస్తున్నాను. స్వీకరించు. లేదా..లేదా. శ్రమ అనుకోకుండా ఈ పాపని నా దేవకి దగ్గరకి చేర్చు. దేవకి గొడ్రాలు కాదు.'' గుండె గట్టిగా పట్టుకుని సీటుకి చేరబడ్డాడు.

''రాజా నువ్వెళ్లు!''

''నిన్నీ పరిస్థితిలో?''

''ఫరవాలేదు. నువ్వు వెళ్తేనే నాకు సంతృప్తి.''

వెనుదిరిగి వెళ్తూ...అలా...కనుమరుగవుతున్న రాజుని కిసలయని చూస్తూ నిశ్చింతగా ఊపిరితీసుకున్నాడు వసుదేవ్.

తన బ్రతుకు మజిలీ అయిపోయింది. ఈ బండి గమ్యం చేరేవరకూ అది వుంటుందో వుండదో?

ఆఖరి క్షణం వరకూ తనని పట్టిపీడిస్తున్న నిజం ఒక్కటే! తను గ్రహించలేని నిజం! తను ఊహించని నిజం!

దేవకి భర్త ఎవరో కాదు.

''రాజు!''

★



## శిల్పా గాడ్‌ఫాదర్!

శిల్పా శెట్టికి ఇప్పుడు అనపేక్షితంగా ఓ గాడ్ ఫాదర్ తయారయ్యాట్ట. ఆయన ఎవరో కాదు, దర్శకుడు ధర్మేష్ దర్శన్. 'రాజా హిందుస్తానీ' సూపర్ హిట్ కావడంతో సూపర్ డైరెక్టర్‌గా క్రేజ్ పెంచేసుకున్న ధర్మేష్ కొత్త చిత్రం 'ధడకన్'లో శిల్పా శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. సమయం దొరికినప్పుడల్లా ''చూస్తూ వుండు. నా 'రాజా హిందుస్తానీ' చిత్రం కరిష్మాని ఏ లెవెల్‌కి తీసుకెళ్లిందో తెలుసుగా. నీకూ నా సినిమా 'ధడకన్' అంత మేలు చేస్తుంది చూడు'' అంటున్నాట్ట. అందుకనే కొత్తగా ఏ సినిమాని ఒప్పుకోవాలన్నా ధర్మేష్‌ని కాంటాక్ట్ చేస్తోందిట శిల్పా. చూడాలి ఈ 'దోస్తానా'కి ఏమైనా ఫలితం వుంటుందో లేదో?

-వి.ఎం.